క్లుప్తంగా

గొట్టిపల్లి వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించిన డీఎంహెచ్‌వో

ఆనందపురం: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని గొట్టిపల్లి వెల్‌నెస్ సెంటర్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు. అక్కడి వైద్య సిబ్బందితో సమావేశమై అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఫీవర్ సర్వే, టీపీ రిజిస్టర్లను పరిశీలించారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి వైద్య సలహాలు అందించి ఐరన్ పోలిక్ మాత్రలు, పోషకాహారం తీసుకునేటట్టు ప్రోత్సహించాలని డీఎంహెచ్‌వో చెప్పారు. నేషనల్ ఫీవర్ హెల్త్ సర్వే, యాప్స్ అప్‌లోడ్‌పై వైద్యాధికారులకు, ఆరోగ్య కార్యకర్తలకు పలు సూచనలిచ్చారు.

జూనియర్ కళాశాలల బంద్ రేపు


బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

భీమునిపట్నం: అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఆధ్వర్యంలో ఈ నెల 28న రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ కళాశాలల బంద్ నిర్వహించనున్నట్లు రాష్ట్ర కో కన్వీనర్ లొడగల అచ్చిబాబు తెలిపారు. భీమిలి బీచ్ పార్కు వద్ద బుధవారం బంద్ పోస్టర్లను ఆవిష్కరంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు ప్రైవేటు విద్యా సంస్థలు పెద్ద ఎత్తున ఫీజులు వసూలు చేయడంపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ కళాశాలల్లో ఖాళీలను భర్తీ చేయాలని, విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు ఇవ్వాలని వీటితోపాటు ఇతర సమస్యలపై ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఏబీవీపీ సభ్యులు ఎం.రాజేష్, ఎల్.చిన్న రవి, ఎల్.అనిల్‌కుమార్, పి.గణేష్, జగన్, ప్రవీణ్, దినేష్, వంశీ, శివ పాల్గొన్నారు.

మందుబాబులకు రూ.40 వేల జరిమానా

పీఎం పాలెం: స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కార్‌షెడ్, కొమ్మాది, రుషికొండ తదితర కూడళ్లలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం తాగి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 22 మందిని పట్టుకున్నట్లు ఎస్ఐ మురళీకృష్ణ తెలిపారు. వారిని స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ అండ్ సెకండ్ క్లాస్ ఎక్సైజ్ కోర్టు ముందు హాజరు పరచగా.. న్యాయస్థానం రూ.40 వేల జరిమానా విధించినట్లు చెప్పారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి చిరువ్యాపారులపై పెట్టీ కేసులు నమోదు చేయగా.. వారికి రూ.200 వంతున జరిమానా విధించారన్నారు. మద్యం తాగి వాహనం నడిపే వారు పోలీసుల నుంచి తప్పించుకోలేరని ట్రాఫిక్ ఎస్ఐ మురళీకృష్ణ హెచ్చరించారు. వ్యాపారం కోసం రోడ్లను ఆక్రమించడం నేరమని చిరువ్యాపారులను హెచ్చరించారు.

పెయింటర్ అదృశ్యం


సత్యాల హరీష్

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు కొత్తపేటకు చెందిన పెయింటర్ సత్యాల హరీష్ ఈ నెల 23న భీమిలి నోవాటెల్ హోటల్ సమీపంలో అదృశ్యమయ్యాడు. ఈ ఘటనపై అతడి భార్య అర్చన భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలిలా.. హరీష్ అతని స్నేహితుడు త్రినాథరావు సాహూతో కలిసి భీమిలి వెళ్లాడు. అక్కడ మద్యం తాగిన హరీష్ హోటల్ వైపు వెళ్లి తిరిగి రాలేదని త్రినాథరావు ఇంటికి వచ్చి అర్చనకు తెలిపాడు. ఈ మేరకు ఆమె భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ భరత్‌కుమార్‌రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగ్లామెట్ట పాఠశాలలో కార్గిల్ విజయ్ దివస్

తగరపువలస: ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో బుధవారం కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. హెచ్‌ఎం అప్పలరాజు దీని విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్ దళాలను ఆక్రమిత లడక్ జిల్లాలోని పర్వత శిఖరాల నుంచి తరిమికొట్టి గొప్ప విజయం సాధించారన్నారు. కార్గిల్ యుద్ధ యోధుల గౌరవార్థం ఏటా జూలై 26న ఇండియా గేట్ అమరజవాన్ జ్యోతి వద్ద సైనికులకు భారత ప్రధాని నివాళులర్పిస్తారన్నారు. ఉపాధ్యాయులు రమేష్, మల్లిక, నాగమణి పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో సత్వర మేలు

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- ఐనాడ, నేరేళ్లవలస, 98వ వార్డుల్లో లబ్ధిదారులకు ధ్రువపత్రాల అందజేత


ఐనాడలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


98వ వార్డు మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి


అడవివరం జగనన్న సురక్ష క్యాంప్‌లో పాల్గొన్న లబ్ధిదారులు

పద్మనాభం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ సత్వర మేలు జరుగుతోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఐనాడ, నేరేళ్లవలస గ్రామాల్లో బుధవారం జగనన్న సురక్ష క్యాంప్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక, ఇతర కారణాల వల్ల అర్హులెవరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదన్న లక్ష్యంతో అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం సత్ఫలితాలనిస్తోందన్నారు. ఈ శిబిరాల ద్వారా 11 రకాల ధ్రువపత్రాలను ఉచితంగా, వేగంగా లబ్ధిదారులకు ఇస్తున్నట్టు తెలిపారు. స్థానిక లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఐనాడలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఐనాడ సర్పంచ్ కోరాడ ఆరంజ్యోతి, పార్టీ నాయకులు మామిడి శివ రామకృష్ణ, కోరాడ పాపారావు, కోరాడ రామేశ్వరరావు, సారిక శంకరరావు, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, తహసీల్దార్ టి.శ్రీవల్లి పాల్గొన్నారు.

అర్హులందరికీ లబ్ధి

సింహాచలం: అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. భీమిలి నియోజకవర్గ పరిధి 98వ వార్డులోని సచివాలయాలకు సంబంధించి అడవివరం పాత గోశాల జంక్షన్ సమీపంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీలకతీతంగా, పారదర్శకంగా, ఎలాంటి వివక్ష లేకుండా అర్హులందరికీ నాలుగేళ్లుగా సంక్షేమ పథకాలను అందిస్తూ.. దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారన్నారు.

ఇతర రాష్ట్రాల్లోనూ అమలు

మన రాష్ట్రంలో అమలులో ఉన్న పథకాలు, పాలనా విధానాలు ఇతర రాష్ట్రాల్లోను అక్కడి ముఖ్యమంత్రులు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి అన్నారు. ఏపీలోని సచివాలయ వ్యవస్థను చూసి తమిళనాడు రాష్ట్రంలో సీఎం స్టాలిన్ 600 సచివాలయాలు పెడుతున్నారని తెలిపారు. ఇంటింటికీ వాహనాల ద్వారా రేషన్ అందించే వ్యవస్థను పంజాబ్ ముఖ్యమంత్రి భగవత్‌మాన్ అమలు చేస్తున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను మిగిలిన రాష్ట్రాల వారంతా మెచ్చుకుంటున్నారన్నారు.

సీఎం జగన్‌ది చేయూతనిచ్చే వ్యక్తిత్వం

ప్రతిపక్ష నేత చంద్రబాబుకు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చాలా తేడా ఉందని ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. చంద్రబాబుది మోసం చేసే వ్యక్తిత్వమని, జగన్‌ది చేయూతనిచ్చే వ్యక్తిత్వమన్నారు. డ్వాక్రా మహిళలను చంద్రబాబు మోసం చేశారన్నారు. సున్నా వడ్డీ, రుణాలు మాఫీ చేస్తానని హామీ ఇచ్చి చేయలేదన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా ఇప్పటికి మూడుసార్లు ఇచ్చారని, ఇంకో విడత కూడా అందిస్తారన్నారు. వృద్ధాప్య పింఛన్లు కూడా రూ.3 వేలు చేశారన్నారు. కరోనా సమయంలో కూడా ఏ పథకం ఆపలేదని, ప్రతీ ఒక్కరికీ సంక్షేమాన్ని అందించారన్నారు. ఇప్పటివరకు రెండు లక్షల కోట్ల రూపాయలు సంక్షేమ పథకాల ద్వారా అందజేశారని చెప్పారు. ఈ సందర్భంగా 1,480 మందికి సర్టిఫికెట్లు జారీ కాగా, పలువురికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి వాటిని అందజేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్-8 ఏపీడీ శ్రీరామ్, 98వ వార్డు జేసీఎస్ కన్వీనర్ లంక సత్తిబాబు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరంబాబు, అడవివరం కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, పార్టీ నాయకులు నడింపల్లి రామరాజు, ఎస్.కృష్ణ, దొంతల సంతోష్, తెడ్లపు మహేష్, టి.రాము, ఎస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వ సాయం

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


రైతులకు విత్తనాల కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం: ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా విభాగం ఆధ్వర్యంలో బుధవారం తర్లువాడలో విత్తన గుళిక అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు వాడకం వల్ల పంటలు నాణ్యత కోల్పోయి అనారోగ్యాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రకృతి వ్యవసాయ పంటలతో మానవుల జీవన ప్రమాణాలు స్థాయి పెరుగుతుందని వివరించారు. తర్లువాడ గ్రామ రైతులంతా ప్రకృతి వ్యవసాయానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళిత రైతులను అన్ని రకాలుగా ఆదుకోడానికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పలు పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మోహనరావు మాట్లాడుతూ రైతులకు విత్తన శుద్ధి దగ్గర నుంచి పంట పండించే వరకూ ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతుల్లో శిక్షణను అందిస్తున్నామని తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పీఎం అజయ్ పథకం కింద ప్రకృతి వ్యవసాయం చేస్తున్న భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి మండలాలకు చెందిన 272 మంది దళిత రైతులకు ఒక్కొక్కరికీ రూ.10 వేలు విలువ చేసే నవ ధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, దుంప జాతులకు చెందిన విత్తనాలు, పురుగుల నివారణకు, లింగాకార్షక బుట్టలు, పసుపు పల్లేలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కె.కనకారావు, రెల్లి కార్పొరేషన్ చైర్మన్ వి.మధుసూదనరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామారావు, సర్పంచ్ బి.ఆర్.బి.నాయుడు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, వ్యవసాయ శాఖ జిల్లా జేడీఏ సుబ్రహ్మణ్యం, ప్రకృతి వ్యవసాయ జిల్లా జేడీ అప్పలస్వామి, భీమిలి ఏడీఏ విజయ్‌భాస్కర్, ప్రాంతీయ అధికారి ప్రకాషరావు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయండి


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం: అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఎంపీపీ కంటుబోతు రాంబాబు అధ్యక్షతన పద్మనాభం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, సచివాలయాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. విజయగనరం-శొంఠ్యాం ఆర్ అండ్ బీ రోడ్డు గోతులను పూడ్చాలని ఆర్ అండ్ బీ అధికారులను, 600 మందికి ఇళ్ల పట్టాలను వేగంగా ఇవ్వాలని, కృష్ణాపురం, పద్మనాభం, బి.ఆర్.తాళ్లవలస గ్రామాల్లోని ఇనాం భూములకు సర్వే చేయాలని తహసీల్దార్ శ్రీవల్లిని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎంపీపీ రాంబాబు మాట్లాడుతూ విలాస్కాన్‌పాలెంలో సాగునీటి కాలువ ఆక్రమణను తొలగించేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. గంధవరం సర్పంచ్ జి.వి.కె.కె.వర్మ మాట్లాడుతూ అనంతవరం-గంధవరం రోడ్డులో పాడైన కల్వర్టును పునర్నిర్మించాలన్నారు. కృష్ణాపురం సర్పంచ్ ఎం.లక్ష్మీభవాని మాట్లాడుతూ కృష్ణాపురం సాగునీటి కాలువలో పూడిక తీతకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. రేవిడి ఎంపీటీసీ సభ్యుడు సీర సూరప్పడు మాట్లాడుతూ వెంకటాపురానికి జల జీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయిలు వేయాలన్నారు. బి.తాళ్లవలస సర్పంచ్ చందక శ్రీను మాట్లాడుతూ బొత్సపేట రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, భీమునిపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచలి సూర్యనారాయణ, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం


లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో భాగంగానే ఇంటింటికీ వచ్చి సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. జీవీఎంసీ 8వ వార్డు తిమ్మాపురం, హరిత అపార్ట్‌మెంట్స్, అడ్రస్ విల్లాస్‌లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ ఏదో ఒక సంక్షేమ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని, అందుకే ఎక్కడికి వెళ్లినా స్థానిక ప్రజలు నీరాజనం పలుకుతున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తున్నామని, సంక్షేమంతోపాటు అభివృద్ధి కూడా సరి సమానంగా సాగుతోందని తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యేకు పలు సమస్యలు విన్నవించుకున్నారు. వీధిలైట్లు, పలు చోట్ల డ్రైనేజీలు ధ్వంసమయ్యాయని, అక్కడక్కడ తాగునీటి సమస్యలు తెలపగా.. వెంటనే వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ముత్తంశెట్టి ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, స్థానిక నాయకులు ఉప్పలూరి గోపి, అల్లాడ ఉమామహేశ్వరరావు, నొడగల రాంబాబు, మాదు చంటి, బుజ్జి, రమణమూర్తి, బొబ్బిలి చిన్న, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రపాలెం ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ముందడుగు

సీతమ్మధార: జోన్-5 మధురవాడ చంద్రపాలెం ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులపై బుధవారం సీతమ్మధారలోని తన నివాసంలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు జాతీయ రహదారుల అధికారులతో చర్చించారు. హైవే పక్కనే ఉన్న చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్‌కు విద్యార్థులు వచ్చి, వెళ్లేటప్పుడు తరుచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో వాటిని నియంత్రించేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రభాకర్ అంజన్‌కు వినతిపత్రం ద్వారా ఎమ్మెల్యే సూచించారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించారు.

వేలం ద్వారా కౌలుకు దేవాలయ భూమి

తగరపువలస: భీమునిపట్నం శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి (శివకేశవ స్వామి) చెందిన ఎ.1.26 సెంట్లు భూమిని బహిరంగ వేలం ద్వారా అధికారులు పూసర్ల రామారావు అనే హెచ్చుపాటదారుడికి కౌలుకు అప్పగించారు. భీమిలి మండలం టి.నగరపాలెం సర్వే నంబర్ 51/1లో ఉన్న ఈ భూమిని 2023 ఆగస్టు నుంచి 2026 జూలై వరకు ఏడాది రూ.26 వేల వంతున వేలంలో నిర్ధారించారు. వేలంపాటలో పర్యవేక్షణాధికారి పి.ఎస్.ఎన్.మూర్తి, లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఈవో బొంగరాల మురళీమోహన్, ఇన్‌స్పెక్టర్ బి.వసంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన


ఓటరు లిస్టును పరిశీలిస్తున్న ఆర్డీవో భాస్కర్‌రెడ్డి

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ ఎస్సీ, బీసీ కాలనీల్లో బుధవారం సాయంత్రం ఆర్డీవో భాస్కర్ రెడ్డి ఓటర్ల జాబితాను, వాటిలో తొలగించాల్సిన పేర్లను, వివిధ అంశాలను పరిశీలించారు. ఈ ప్రాంతాల్లో ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలించాలని అధికారులను ఆయన ఆదేశించారు.

కార్బన్ సమస్యలకు ఇంధనంతో పరిష్కారం


ప్రొఫెసర్ సూర్యప్రకాష్‌ను సత్కరిస్తున్న గీతం ప్రతినిధి

కొమ్మాది: పరిశ్రమలు, వాహనాల ద్వారా నిత్యం వెలువడే కర్బన కాలుష్యం నుంచి ఇంధనం తయారు చేసి ప్రపంచం ఎదుర్కొంటున్న గ్రీన్‌హౌస్ వాయువుల సమస్యలకు చెక్ చెప్పవచ్చని రసాయన శాస్త్రవేత్త, అమెరికా లాస్ ఏంజిల్స్‌లోని లాకర్ హైడ్రోకార్బన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.కె.సూర్యప్రకాష్ అన్నారు. గీతంలో బుధవారం కార్బన్ సమస్యలకు కార్బన్‌తోనే పరిష్కారం అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ప్రపంచ పారిశ్రామిక విప్లవం తరువాత కర్బన శాతం క్రమేపి పెరిగి నేడు మానవాళి మనుగడకు ముప్పుగా పరిణమించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కాలుష్య కారక కార్బన్ వాయువు నుంచి ఇంధనం తయారు చేసే తమ పరిశోధనలు సత్ఫలితాలిచ్చాయని వివరించారు. అనంతరం ప్రొఫెసర్ సూర్యప్రకాష్‌ను గీతం ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో వీసీ దయానంద సిద్ధవట్టం తదితరులు పాల్గొన్నారు.

కుమ్మేసిన వాన


గంభీరం రిజర్వాయర్ గేట్ల నుంచి పొంగిపొర్లుతున్న వరద నీరు


గొట్టిపల్లిలో వరద నీటికి విత్తనాలు కొట్టుకుపోయిన వరినారు మడి


హైవే సర్వీస్ రోడ్డులో చంద్రంపాలెం వద్ద వాన నీటిలో ప్రయాణిస్తున్న వాహనాలు


రుషికొండ సమీపంలో చెరువును తలపిస్తున్న రోడ్డు

- లోతట్టు ప్రాంతాలు జలమయం

మధురవాడ: రోజూ కురుస్తున్న భారీ వర్షానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం వాన కుమ్మేయడంతో లోతట్టు ప్రాంతాలు, గెడ్డలు, కాలువలు జలమయమయ్యాయి. రహదారులపై వాన నీరు పొంగి పొర్లింది. పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఐదు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి చాలా మంది ఇళ్లకే పరిమితమయ్యారు. మధురవాడ పరిసర ప్రాంతాల్లో సాయంత్రమైతే చాలు భారీ వర్షం కురుస్తోంది. దాని ప్రభావంతో మధురవాడ అప్ బ్రిడ్జి, మధురవాడ డైలీ మార్కెట్, హైవేపై చంద్రంపాలెం వద్ద, రేవళ్లపాలెం, పాత పరదేశిపాలేనికి వెళ్లే రహదారుల్లో వర్షం నీరు మోకాళ్ల పైన లోతులో చేరిపోయింది. ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

చెరువులను తలపించిన రహదారులు

కొమ్మాది: సాగర్‌నగర్, రుషికొండ, ఎండాడ ప్రాంతాల్లో బుధవారం కురిసిన వర్షానికి ప్రధాన రహదారులన్నీ చెరువులను తలపించాయి. కాపులుప్పాడ పరదేశిపాలెం గెడ్డపై భారీ స్థాయిలో వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తుపాను నేపథ్యంలో అధికారుల ఆదేశాల మేరకు ఉప్పాడ, భీమిలి, మంగమారిపేట, తిమ్మాపురం, రుషికొండ ప్రాంతాల్లో మత్స్యకారులు వేటకు స్వస్తి పలికారు. సముద్రంలో కెరటాలు పెద్ద ఎత్తున ఎగసిపడటంతో పడవలు, బోట్లు, విలువైన వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించుకున్నారు.

నీట మునిగిన వరి నారుమడులు

ఆనందపురం: మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. గెడ్డలు, కాలువలు పొంగిపొర్లుతున్నాయి. చెరువుల్లో నీటి నిల్వలు సరాసరి స్థాయికి చేరుకున్నాయి. వర్షాలు కురవడానికి ముందు రోజున మండలంలోని పలు గ్రామాల రైతులు నారుమడుల్లో వరి విత్తనాలు పోశారు. ఎడతెరిపి లేని వర్షాలకు అవి పూర్తిగా నీటితో నిండిపోయాయి. గొట్టిపల్లి, కుసులువాడ, పాలవలస, ముకుందపురం, ముచ్చర్ల, బాకురుపాలెం, శిర్లపాలెం, కణమాం తదితర గ్రామాల్లో నారుమడులు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొన్ని మడుల్లో విత్తనాలు కుళ్లిపోగా, మరికొన్నింటిలో మొలకెత్తిన విత్తనాలు కొట్టుకుపోయాయి. సుమారు 300 ఎకరాలకు సంబంధించి వరి నారుమడులు దెబ్బతినడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

నిండుకున్న గంభీరం రిజర్వాయర్

మండలంలోని గంభీరం రిజర్వాయర్ వరద నీటితో పూర్తి స్థాయిలో నిండిపోయి నిండుకుండలా తొణికిసలాడుతోంది. 24 గేట్ల ద్వారా వరదనీరు కిందకు పరవళ్లు తొక్కుతూ సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 126 అడుగులు కాగా.. సరాసరి స్థాయిలో నిండిపోయింది.

గోస్తనీ నది పరవళ్లు

తగరపువలస: భీమిలి పరిధిలో బుధవారం మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. వ్యాపార సంస్థలు బోసిపోయాయి. స్థానిక ప్రైవేట్ మార్కెట్‌లో అడుగు తీసి వేయలేని పరిస్థితి కనిపించింది. చెరువులు నిండిపోయి కనిపించగా గోస్తనీ నది ఉధృతంగా పరవళ్లు తొక్కుతూ ప్రవహించింది. దీన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాలవారు గొడుగులు, రెయిన్ కోట్లతో నదీతీరానికి చేరుకుంటున్నారు. ముఖ్యంగా తగరపువలస పాత వంతెన వద్ద నది ప్రవాహాన్ని చూసి పలువురు తన్మయత్వం చెందారు. వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా భీమిలి మండలంలో పలుచోట్ల రైతులు వ్యవసాయ పనులకు ఉపక్రమించారు.

సబ్బివానిపేట అండర్‌పాస్ నుంచి ప్రవహిస్తున్న నీరు

జీవీఎంసీ రెండో వార్డు సబ్బివానిపేట అండర్‌పాస్ వద్ద బుధవారం సాయంత్రం వరకు వర్షం నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సర్వీస్ రోడ్డులో సిటీ బస్సులు హైవే మీదుగా వెళ్లిపోతున్నాయి. దీంతో వెంకటేశ్వర మెట్ట నుంచి స్థానికులు పారుతున్న నీటిలో నడుచుకుంటూ ఇళ్లకు చేరుకుంటున్నారు.

హిందీ పరీక్షల ఫీజు గడువు 31 వరకు పెంపు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచార సభ-చెన్నై ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9, 10వ తేదీల్లో జరిగే లోయర్, హయ్యర్ పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లింపునకు ఈ నెల 31 వరకు గడువు పెంచారు. లోయర్ పరీక్షలైన పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్రభాష, ప్రవేశికలకు అపరాధ రుసుం లేకుండా, హయ్యర్ పరీక్షలైన రాష్ట్ర భాష విశారధ పూర్వార్ధ, రాష్ట్రభాష విశారధ ఉత్తరార్ధ, రాష్ట్రభాష ప్రవీణ పూర్వార్ధ, రాష్ట్రభాష ప్రవీణ ఉత్తరార్ధ పరీక్షలకు రూ.10 అపరాధ రుసుంతో ఈ ఫీజులు చెల్లించవచ్చు. ఈ పరీక్షలకు భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్‌ను కేంద్రంగా ఎంపిక చేశారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 89856 47419, 89858 97419లలో సంప్రదించాలని ఆదర్శ హిందీ ప్రేమీ మండలి-భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఇరుకు రోడ్లపై రవాణా వాహనాల నిలిపివేత


సంతపేట రెడ్డి వీధి రోడ్డులో నిలిపిన వ్యాన్

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంతపేట రెడ్డి వీధి రహదారిలో నిత్యం సరకు రవాణా వాహనాలు నిలిపివేయడంతో ఇతర వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అసలే ఇరుకైన ఈ రోడ్డులో బిల్డింగ్ మెటీరియల్‌కు చెందిన వ్యాపారుల గొడౌన్‌లు ఉన్నాయి. దీంతో నిత్యం లోడింగ్, అన్‌లోడింగ్‌ల పేరుతో సరకు రవాణా వాహనాలను నిలిపి వేస్తున్నారు. మిగిలిన వాహనదారులు గంటల తరబడి వేచి ఉన్నా.. రహదారిపై అడ్డంగా ఉంచిన వాహనాలు తొలగించకపోవడంతో నిత్యం తగాదాలకు జరుగుతున్నాయి. ఒక్కోసారి రేషన్, క్లాప్ వాహనాలు కూడా రవాణా వాహనాల కారణంగా తప్పించుకుని ముందుకు వెళ్లలేకపోతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ సిబ్బంది సమస్యను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న న్యాయమూర్తి వెంకట శేషమ్మ

ఏయూ క్యాంపస్: ర్యాగింగ్‌కు పాల్పడడం చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ అన్నారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఏపీ ర్యాగింగ్ నిషేధ చట్టం 1997 గురించి విద్యార్థులకు వివరించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే తీసుకునే చర్యలను తెలియజేశారు. అదే విధంగా యువత వాహనాలు నడిపే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, మోటారు వాహన చట్టాలు, తాజాగా వచ్చిన మార్పులు వివరించారు. మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి.రాము మాట్లాడుతూ నగరంలో ర్యాగింగ్, మత్తు పదార్థాలకు సంబంధించి గతంలో నమోదైన కేసులు, పర్యవసానాలు వివరించారు. విద్యార్థులు వీటికి దూరంగా ఉంటూ తమ ఉన్నత భవిష్యత్‌ని పదిలం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆచార్య ఎ.ప్రసాద్, ఆచార్య ఎస్.పాల్ డగ్లస్, తదితరులు పాల్గొన్నారు.